క్లుప్తంగా

సమాజాన్ని మార్చే ఆయుధం చదువు



ప్రజ్ఞ వికాసం పరీక్ష పత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఉరవకొండ: చదువు సమాజాన్ని మార్చే ఆయుధం అని, విద్యార్థుల్లో పరీక్షలపై ఉన్న భయాన్ని తొలగించి, మనో స్థైర్యాన్ని నింపడానికే ప్రజ్ఞ వికాసం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు తెలిపారు. స్థానిక ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మార్చిలో జరిగే పరీక్షల కోసం సిద్ధం చేయడానికి ప్రజ్ఞ వికాసం పరీక్షలు నిర్వహించారు. ఈపరీక్ష పేపర్లను ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు విడుదల చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధూ, యూటీఎఫ్ జిల్లా ఆడిటింగ్ సభ్యులు రాజశేఖర్, మండల అధ్యక్షులు ఉమాపతి, ట్రెజరర్ బండయ్య, ఇస్లాంబాష మాట్లాడారు.

హెల్మెట్ ధరించకపోతే జరిమానా



హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారుడిని హెచ్చరిస్తున్న సీఐ రాజు

కూడేరు: ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని లేదంటే జరిమానా తప్పదని సీఐ రాజు హెచ్చరించారు. ఆదివారం అరవకూరు వద్ద అనంతపురం - బళ్లారి ప్రధాన రహదారిపై సిబ్బందితో కలిసి సీఐ రాజు వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించారు. ప్యాసింజర్ ఆటో డ్రైవర్లకు కెపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని హెచ్చరించారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



బహుతులు ప్రదానం చేస్తున్న మహిళా మండలి ప్రతినిధులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని హటకేశ్వర స్వామి ఆలయంలో స్వకులసాలి సమాజ రాజరాజేశ్వరి మహిళా మండలి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సంక్రాంతి ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. జూనియర్, సీనియర్స్ విభాగాల్లో జరిగిన ముగ్గుల పోటీల్లో 22 మంది మహిళలు, బాలికలు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు అనురాధ, శ్రీదేవి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. సీనియర్ విభాగంలో యమున, సుష్మ, భారతి, జూనియర్ విభాగంలో చైత్ర, కీర్తన, తనుశ్రీ తొలి మూడుస్థానాల్లో విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు విమల, కార్యదర్శి సరస్వతి, గౌరవాధ్యక్షురాలు సునంద, స్వకులసాలి సమాజ అధ్యక్షులు వెంకటేశులు, కార్యదర్శి లక్ష్మీనారాయణ, విద్యావర్ధక సంఘం అధ్యక్షుడు ఆనందరావు, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై ఇష్టారాజ్యంగా పార్కింగ్



క్లాక్‌టవర్ సమీపంలో ప్రధాన రహదారిపై తోపుడు బండ్లపై కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

ఫుట్‌పాట్లు..!

- పాదచారులు, వాహనదారులకు దారి లేక అవస్థలు
- ఉరవకొండలో రోడ్లపై నిలుపుతున్న ద్విచక్ర వాహనాలు, ఆటోలు
- క్లాక్‌టవర్ సమీపంలో తోపుడు బండ్లపైనే వ్యాపారాలు



రోడ్డుపైనే ఆటోలు నిలిపి ఉంచడంతో అవస్థలు పడుతున్న పాదచారులు

ఉరవకొండ: ప్రస్తుత సమాజంలో వాహనం నిత్యావసరం అయ్యింది. పాదచారులు తక్కువయ్యారు. ఇల్లు విడిచి బయటకు వెళ్లాలంటే ప్రతి చిన్నపనికీ వాహనం తీయాల్సిందే. దీంతో రోజురోజుకూ వాహనాల సంఖ్య ఎక్కువవుతోంది. వాహనాలకు తగ్గ రోడ్లు కూడా రద్దీ అవుతున్నాయి. దీంతో ఎక్కడ చూసినా ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీనికితోడు రోడ్లపైనే విచ్చలవిడిగా వాహనాలు నిలుపుతుండడంతో వాహనదారులు, దుకాణదారులకు సమస్య అవుతోంది. ఉరవకొండ పట్టణంలో పరిస్థితి ఇలానే తయారైంది. పట్టణంలోని నడకదారులు కనిపించకుండా పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే ఉరవకొండ క్లాక్‌టవర్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య పెరిగిపోయింది. క్లాక్‌టవర్ సమీపంలోనే ప్రధాన రహదారి పైనే తోపుడు బండ్ల పెట్టుకొని ఫ్రూట్స్, కాయగూరలు, జ్యూస్, టిఫెన్ బండ్ల వ్యాపారులు రోడ్లను ఆక్రమించుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. క్లాక్‌టవర్ ప్రాంతంలో షాపులు నిర్వహిస్తున్న యజమానులు వారి షాపుల ముందు డబ్బులు తీసుకొని తోపుడు బండ్లు పెట్టుకోవడానికి అనుమతి ఇస్తున్నారు. ఫలితంగా క్లాక్‌టవర్ వద్ద ఇష్టారాజ్యంగా ప్రధాన రహదారి పైనే ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకంగా వ్యాపారులు నిర్వహిస్తున్నారు.

ఇష్టారాజ్యంగా నిలుపుతున్న వాహనాలు..

పట్టణంలోని క్లాక్‌టవర్ నుంచి ప్రభుత్వాస్పత్రి వరకు ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు, ఇతర వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. హోటళ్లతో పాటు వస్త్ర దుకాణాలు, కిరాణా షాపులు ఎదురుగానే వాహనాలు నిలుపుతుండడంతో అంతర్గత రహదారులకు ఇరువైపులా వాహన రాకపోకలు సాగించలేని పరిస్థితి.

రోడ్లపైనే అడ్డదిడ్డంగా ఆటోలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రోడ్లపై ఆటోవాలాలు హల్‌చేల్ చేస్తున్నారు. గ్రామాలకు వెళ్లే ప్యాసింజర్ ఆటోలతోపాటు, రోజువారి ఆటోవాలాలు సైతం రోడ్లపై పార్కింగ్ చేస్తుండడం పాదచాదారులు అవస్థలు పడుతున్నారు. పాత బస్టాండ్ రాణీఛత్రం ఏరియా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, పాత బస్టాండ్ ప్రధాన రహదారి కూడలి, బళ్లారి రోడ్డు, ఆస్పత్రి గేటు వద్ద ఆటోలు రోడ్లపైనే నిలిపి, ప్యాసింజర్లను ఎక్కించుకుంటున్నారు. దీంతో కాలిబాటన వెళ్లే వారు నడిరోడ్లపైన వెళ్లాల్సిన పరిస్థితి. వినాయక సర్కిల్‌లో బస్సుల్లో వస్తే ప్రయాణికులకోసం బస్సు చుట్టూ ఆటోలు నిలిపి ట్రాఫిక్‌కు మరింత అంతరాయం కలిగిస్తున్నారు. పాత బస్టాండ్‌లో అయితే పరిస్థితి ఘోరంగా ఉంటుందని, అడుగుపెట్టలేని విధంగా ఆటోలు ఉంటాయని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లపై సాహసం చేయాల్సిందే..



ఉరవకొండలోని క్లాక్‌టవర్ వద్ద నుంచి వాహనం తీసుకెళ్లాలంటే ఎంతో సాహసం చేయాలి. వాహనదారుల పరిస్థితి ఇట్లు ఉంటే పాదచారులు నడవాలంటే ఏ వాహనం ఎటు వైపు వస్తోంది తెలియని పరిస్థితి. అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలి.

– విజయ్, అంబేద్కర్‌నగర్, ఉరవకొండ

రోడ్డు దాటాలంటే అవస్థలు



రోడ్డు మధ్యలో తోపుడు బండ్లు పెట్టడంతో పిల్లలతో రోడ్డు దాటడానికి ఎంతో ఇబ్బంది పడుతున్నాం. నడిచి వెళ్లడానికి వీలు లేకుండా ఇష్టారాజ్యంగా బండ్లు, ఆటోలు పెడుతున్నారు. వేగంగా వచ్చే వాహనాల నుంచి తప్పుకోలేక భయభ్రాంతులకు గురవుతున్నాం. – దొకారి మంజుల, డ్రైవర్స్‌కాలనీ, ఉరవకొండ

ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తాం



గతంలో క్లాక్‌టవర్ చుట్టూ గంపలు, తోపుడు బండ్లు పెట్టుకొని వ్యాపారాలు చేసేవారు. వారిని మరో చోట పెట్టుకొని వ్యాపారాలు చేయాలని సూచించాం. కవితా హోటల్ సర్కిల్ వద్ద ట్రాఫిక్‌కు అడ్డంగా వాహనాలు, తోపుడు బండ్లు పెట్టకుండా చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– గౌస్‌సాహెబ్, ఈఓ, మేజర్ పంచాయతీ, ఉరవకొండ

భక్తిశ్రద్ధలతో రుద్రపారాయణం



అవతార ప్రకటన దివ్యక్షేత్రంలో బాబా చిత్రపటం వద్ద పూజలు నిర్వహించిన దృశ్యం

ఉరవకొండ: ఉరవకొండలోని సత్యసాయి అవతార ప్రకటన దివ్యక్షేత్రంలో ప్రత్యేక భజనలు, త్రయంబక రుద్ర పారాయణం ఆదివారం వైభవంగా జరిగింది. ప్రపంచానికి ప్రేమతత్వాన్ని చాటిన భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో బాబా అవతార ప్రకటన చేసిన గుండు వద్ద సత్యసాయి విగ్రహానికి విశేష పూజలు చేశారు. అనంతరం ఓంకారం, సాయిగాయత్రి, జ్యోతి ప్రజ్వలన, గణపతి ప్రార్థన మందిరం, నమకం పారాయణం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ దాశెట్టి రామాంజనేయులు, మహిళా భక్తులు, బాలవికాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి

కంబదూరు: రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టడంతో పాటు నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కంబదూరులో ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకులు ఆదివారం డిమాండ్ చేశారు. కంబదూరులోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గం తడుకు పేటకు చెందిన అగ్ర కులాలు మూక్కుమ్మడిగా దాడి చేశారన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేశాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకులు కురాకుల పల్లి గోపాల్, నాగరాజు, నరసింహులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రవిబాబు

శెట్టూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌ను కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం నుంచి పోలీసు స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, పరిష్కారమైనవి...సిబ్బంది హాజరు తదితర వాటిపై పరిశీలించారు. మండలంలో మిస్సింగ్ కేసుల వివరాలతో పాటు కర్ణాటక అక్రమ మద్యం రవాణా ఫైళ్ల నిర్వహణపై డీఎస్పీ స్థానిక ఎస్ఐ రాంభూపాల్‌పై అసహనం వ్యక్తం చేశారు.

నేడు జీడిపల్లిలో పెద్దమాంబ దేవర

బొమ్మనహాళ్ (బెళుగుప్ప): మండలంలోని జీడిపల్లి గ్రామంలో సోమవారం గ్రామ దేవత పెద్దమాంబ దేవర కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. గ్రామంలోని అమ్మవారి ఆలయం వద్ద సాయంత్రం 7 గంటలకు పాలి పూజలు, కుంభం పూజలు ప్రారంభమై, అర్ధరాత్రి బలి పూజ ఉంటుందని గ్రామ పెద్దలు తెలిపారు.

సంక్షేమ పథకాల అమలులో విఫలం

బొమ్మనహాళ్: సంక్షేమ పథకాల అమలులో కూటమి సర్కారు విఫలమైందని వైఎస్సార్‌సీపీ యవనేత మెట్టు విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పయ్యావుల శ్రీరాములు గుండె పోటుతో రెండు రోజుల క్రితం మృతి చెందాడు. పార్టీ శ్రేణులతో కలిసి మెట్టు విశ్వనాథ్‌రెడ్డి ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. భూటకపు హామీలతో అధికారంలోకొచ్చిన చంద్రబాబు గద్దెనెక్కాక ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేసి పేదల జీవితాలకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని, ప్రతి ఒక్కరికీ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎంసీహెచ్ రాజ్ కుమార్, పయ్యావుల సత్యన్న, పరమేశ్వర, డాక్టర్ బసప్ప, జీఎం నాయుడు, సూర్యప్రతాప్‌రెడ్డి, మారుతి, డాక్టర్ బసప్ప, వెంకటేశులు బుజ్జి పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రభాకర్ గౌడ్ బళ్లారిలోని బీకే నర్సింగ్ హోమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ యువనేత మెట్టు విశ్వనాథ్‌రెడ్డి ఆస్పత్రిలో ప్రభాకర్‌గౌడ్‌ను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నాయకులు అంజిరెడ్డి, నుంకేష్, రమేష్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైంది

డి హీరేహాళ్(రాయదుర్గం): ఏడు నెలల పాలనకే ఏడింతల వ్యతిరేకతను కూటమి ప్రభుత్వం మూట కట్టుకుందని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం డి హీరేహాళ్ మండలం మలపనగుడికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రాయదుర్గానికి తరలివచ్చి మెట్టు విశ్వకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తన నివాసంలో వారితో సమావేశం నిర్వహించారు. అనంతరం విశ్వ మాట్లాడారు. ఎన్నికల్లో అపద్దపు హామీలు ఇవ్వడం, గద్దెనెక్కాక వాటిని విస్మరించడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. సూపర్‌సిక్స్ హామీలిచ్చి వాటిని గాలికొదిలేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. వైఎస్సార్‌సీపీ అంటేనే క్రమశిక్షణ కలిగిన పార్టీ అన్నారు. ఎంతటివారైన సరే పార్టీకి విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి సారథ్యంలో సంక్రాంతి తర్వాత పార్టీని మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారందరికీ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మలపనగుడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెట్టు విశ్వనాథ్‌రెడ్డి

పీహెచ్‌సీ భవనం ప్రారంభానికి నోచుకునేదెన్నడో?



పీహెచ్‌సీ పాత భవనం ఇదే..



అన్ని హంగులతో నిర్మించిన పీహెచ్‌సీ భవనం

కణేకల్లు: యర్రగుంట నూతన పీహెచ్‌సీ భవనం ప్రారంభానికి నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైద్యరంగానికి పెద్దపీట వేశారు. ఆస్పత్రి భవనానికి రూ. 1.73 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులు చకచకా పూర్తవుతున్న సమయంలో ఎన్నికల కోడ్‌తో ప్రారంభానికి నోచుకోలేదు. వాస్తవానికి 1986లో యర్రగుంట పీహెచ్‌సీని ఏర్పాటు చేశారు. మొత్తం పనులన్నీ పూర్తయ్యాయి. ఓపీ, ఇన్‌పేషెంట్ గది, ల్యాబ్, ఫార్మసీ గదితోపాటు అన్ని సుందరంగా నిర్మించారు. అయితే భవనం ప్రారంభానికి నోచుకోక దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్త పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని యర్రగుంట గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

వజ్రకరూరు: మండల కేంద్రంలోని మెయిన్‌బజార్‌లో ఆదివారం మధ్యాహ్నం పెను ప్రమాదం తప్పింది. పామిడి మండలం దిబ్బసానిపల్లికి చెందిన భాస్కర్,మరొకరు ద్విచక్రవాహనంపై దిబ్బసానిపల్లికి బయల్దేరాడు. వజ్రకరూరులో ఎదురుగా వచ్చిన లారీ ఒరిగిపోయింది. అక్కడే ఉన్న ద్విచక్రవాహనం కిందకు ఒరిగిపోవడంతో వెనుక కూర్చున్న భాస్కర్ లారీ చక్రం కింద పడిపోయాడు. స్థానికులు గమనించి కేకలు వేశారు.దీంతో లారీ డ్రైవర్ అప్రమత్తమై అక్కడే ఆపివేశాడు. వెంటనే స్థానికులు లారీ చక్రాల కింద పడిపోయిన భాస్కర్‌ను బయటకు లాగారు. గాయపడిన భాస్కర్‌ను సమీపంలోని ప్రైవేట్ క్లినిక్‌కు తీసుకెళ్లారు. లారీ డ్రైవర్ అప్రమత్తతతో పెనుప్రమాదం తప్పింది.

10న వరిగడ్డి వేలం

కణేకల్లు: కణేకల్లు అగ్రికల్చర్ ఫారంలోని వరిగడ్డిని ఈనెల 10న వేలం వేస్తున్నట్లు ఏడీఏ నారాయణనాయక్ ఆదివారం తెలిపారు. 10న ఉదయం 12:30 గంటలకు వేలం ఉంటుందన్నారు. రైతులు అసిస్టెంట్ డైరెక్టర్, ఎస్ఎస్ఎంఎఫ్ సేల్ ప్రొసీడ్స్ పేరిట రూ.లక్ష డీడీ తీసి మధ్యాహ్నం 12 గంటల లోపు అందజేయాలన్నారు.

70 టెట్రా ప్యాకెట్లు పట్టివేత



కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను చూపుతున్న ఎస్ఐ శివ

బెళుగుప్ప: మండల కేంద్రంలోని కాలనీల్లో ఆదివారం కర్ణాటక మద్యం 70 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు. కర్ణాటక అక్రమ మద్యం క్రయవిక్రయాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

భయం గుప్పెట్లో బాలికలు



పెచ్చులూడేలా ఉన్న రాయదుర్గం ఎస్సీ బాలికల వసతి గృహం గది పైకప్పు

- శిథిలావస్థకు చేరిన ఎస్సీ బాలికల వసతి గృహం
- పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న ఆరు గదులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారు. ఎన్నో ఆశలతో సొంతూళ్లను వదిలి పట్టణాలకు వచ్చి చదువుతున్న బాలికలకు ఇక్కడి దుస్థితిలో ఉన్న సంక్షేమ హాస్టళ్లను చూసి భవిష్యత్‌పై భరోసా సన్నగిల్లుతోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతి గదుల్లో పాఠాలు విని, పుస్తకాలతో కుస్తీ పట్టి వచ్చిన వారికి రాత్రిళ్లు నిర్భయంగా కంటినిండా నిద్రించే పరిస్థితి లేదు. ఏ క్షణాన ఏ గది పైకప్పు పెచ్చులూడి పడిపోతుందోనని భయం గుప్పెట్లో కాలం వెళ్లదీస్తున్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో మొత్తం 12 గదులు ఉండగా, 6 గదుల్లో పెచ్చులూడి వినియోగించలేని విధంగా ఉన్నాయి. గోడలుకూడా నెర్రలు చీలాయి. దీంతో మిగిలిన ఆరు గదుల్లోనే 80 మంది విద్యార్థులు సర్దుకోవాల్సిన పరిస్థితి. వర్షం వచ్చిందంటే పూర్తిగా గదులు కారుతున్నాయి. గదులతో పాటు వరండాలోని పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న మరో ఆరు గదుల్లోనూ పైకప్పు భద్రత లేదని విద్యార్థినులు భయాందోళనలు చెందుతున్నారు.



శిథిలావస్థకు చేరిన ఎస్సీ బాలికల వసతి గృహం



వరండా పైకప్పు పెచ్చులూడుతున్న దృశ్యం

సౌకర్యాలు మృగ్యం..: మరోవైపు విద్యార్థినులకు మినరల్ వాటర్ సౌకర్యం లేదు. అన్ని అవసరాలకు బోరు నీరు వాడాల్సి వస్తోంది. బాత్‌రూముల నుంచి మురుగునీరు ముందుకు వెళ్లకపోవడంతో పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొంది.

రేకుల షెడ్డులో కళాశాల బాలికల వసతి గృహం

పట్టణంలోని భంభంస్వామి రోడ్డులో కళాశాల బాలికల వసతి గృహం అద్దె ప్రాతిపకదిన రేకులషెడ్డులో కొనసాగుతోంది. బాలికలంతా హాల్‌లోనే నిద్రపోవాల్సి వస్తోంది. రేకులతో షెడ్డు ఏర్పాటు చేయడంతో చలితో వణికిపోవాల్సి వస్తోంది. 80 మంది విద్యార్థినులుండగా కేవలం 5 వాష్ రూములు, 5 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. ప్రహరీ లేదు. హాస్టల్ పరిసరాల్లో డ్రైనేజీ నీటితో దోమల బెడద అధికమైంది.

ప్రతిపాదనలు పంపాం

ఎస్సీ సంక్షేమ హాస్టల్ భవనం పాతది కావడంతో గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. పెచ్చులూడుతున్నట్లు విద్యార్థినులు చెప్తున్నారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించేందుకు ఇది వరకే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రతిపాదనలు కూడా పంపాం.

– శ్రీవాణి, హాస్టల్ వార్డెన్

బిక్కుబిక్కుమంటూ ఉండాల్సి వస్తోంది..



హాస్టల్ గదుల్లో పెచ్చులూడుతుండడంతో భయమేస్తోంది. ఆరు గదుల్లో పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇతర గదుల్లో సర్దుకుని ఉంటున్నాం. ప్రస్తుతం ఉంటున్న గదులు కూడా భద్రత లేదు. వర్షం వస్తే గోడలు కారుతున్నాయి. నూతన భవనాలు నిర్మించి, సమస్య పరిష్కరించాలి.

– పుట్టుబాయి, మేఘన, విద్యార్థినులు, ఎస్సీ బాలికల వసతి గృహం

హైందవ శంఖారావంలో గవిమఠం ఉత్తరాధికారి



విజయవాడలో జరిగిన హైందవ శంఖారావ సభలో పాల్గొన్న గవిమఠం ఉత్తరాధికారి

ఉరవకొండ: విజయవాడ సమీపంలోని కేసరపల్లిలో విశ్వ హిందూపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన హైందవ శంఖారావ సభలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన గవిమఠం తరపున ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి హాజరయ్యారు. ఈసభలో గవిమఠం ఉత్తరాధికారి మాట్లాడుతూ హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తిని కల్పిస్తూ వెంటనే చట్టణ సవరణ చేసి, దేవాలయాలు, ఆస్తులు, వ్యవస్థలపై దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. శోభాయాత్రలు, దేవి,దేవతల ఊరేగింపులపై ప్రభుత్వాలు అక్రమ ఆంక్షలు విధించరాదన్నారు. ఆలయాల్లో పూజ, ప్రసాద కైంకర్య సేవలను అత్యంత భక్తిశ్రద్ధలతో నాణ్యతతో నిర్వహించేలా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వ్యక్తిపై దుండగుల దాడి



బాధితుడు మల్లయ్యస్వామి

బొమ్మనహాళ్: మండలంలోని జిందాల్ సాప్ ఫ్యాక్టరీ సమీపంలోని కురువల్లి రహదారిలో మల్లయ్య స్వామి అనే వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి, నగదు అపహరించిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని సిద్దరాంపురానికి చెందిన మల్లయ్యస్వామి బళ్లారి నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా జిందాల్ ఫ్యాక్టరీ సమీపంలో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనాలను రోడ్డుకు అడ్డుగా పెట్టి, మల్లయ్యస్వామిపై దాడి చేశారు. అతని వద్ద ఉన్న రూ.10,500 నగదు లాక్కొని అక్కడి నుంచి ఉడాయించారు. అదే సమయంలో కురువల్లికి చెందిన తెలిసిన వ్యక్తి రావడంతో అతని వెంట మల్లయ్యస్వామి ఇంటికి వెళ్లాడు. గాయాలు కావడంతో స్థానిక ఆర్ఎంపీ వద్ద వైద్య సేవలు పొందాడు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధితుడు, అతని బంధువులు తెలిపారు.